క్లుప్తంగా

28లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

అనుమసముద్రంపేట: మండలంలోని రైతులు ఈ నెల 28లోగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ టీ రజని కోరారు. గురువారం ఆమె ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలని, లేని పక్షంలో వైఎస్సార్ సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీలు అందవని తెలిపారు.

పెట్రోల్ బంక్‌ల్లో తనిఖీలు



చేజర్ల: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని పెట్రోల్ బంక్‌లను తహసీల్దార్ శివకృష్ణయ్య గురువారం తనిఖీ చేశారు. బోడిపాడు సెంటర్‌లోని నాగరత్నమ్మ ఫిల్లింగ్ స్టేషన్, ఆదూరుపల్లిలోని స్టార్ ఫిల్లింగ్ స్టేషన్, జమునా ఫిల్లింగ్ స్టేషన్లలో పెట్రోల్, డీజిల్ నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. డీటీ రవి, హెచ్‌పీ సేల్స్ ఆఫీసర్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

టిప్పర్ బోల్తా

సంగం: టైరు పంక్చర్ కావడంతో టిప్పర్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఆత్మకూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు గ్రావెల్ లోడుతో వెళ్తున్న టిప్పర్ ఉడ్‌హౌస్‌పేట సమీపంలోకి రాగానే టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



ఉదయగిరి: గండిపాళెంలోని గుంటుపల్లి కొండయ్యచౌదరి-సుబ్బమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 155 మంది విద్యార్థులకు అమెరికాకు చెందిన ఆశాజ్యోతి చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సీఆర్పీ బీ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకటరత్నమ్మ మృతికి సంతాపం



మర్రిపాడు: ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి ఎస్ శాంతికుమారి తల్లి వెంకటరత్నమ్మ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆమె అంత్యక్రియలను మండలంలోని కంపసముద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై వెంకటరత్నమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



వింజమూరు: మండలంలోని ఏ కిస్తీపురం గ్రామానికి చెందిన ఉప్పరపల్లి మస్తాన్‌రెడ్డి కేన్సర్‌తో మృతి చెందగా ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయంగా రూ.10వేలు మంజూరు చేసింది. గురువారం బాధిత కుటుంబానికి ఎంపీడీఓ ప్రసన్నకుమారి నగదు అందజేశారు. సర్పంచ్ దాట్ల రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయమ్మ, ఎం పెంచలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో రభస

కొండాపురం : టీడీపీ మండల కన్వీనర్ మార్పుపై రభస నెలకొంది. టీడీపీ మండల కన్వీనర్ మార్పుపై అభిప్రాయసేకరణ పేరుతో కలిగిరిలోని తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు మండల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. నాయకుల, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రస్తుతం కన్వీనర్ లక్ష్మీనారాయణను తొలగిస్తూ పార్లపల్లికి చెందిన మామిళ్లపల్లి ఓంకార్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో తెలుగు యువత మాజీ అధ్యక్షుడు జాగర్లమూడి శ్రీనివాసులు, మాజీ ప్రధాన కార్యదర్శి కిలారి నరేంద్రతో పాటు మరో పది మంది టీడీపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అభిప్రాయ సేకరణ కోసం పిలిచి ఏకపక్షంగా కన్వీనర్‌ను ప్రకటించడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో బొల్లినేని, టీడీపీ నాయకుల మధ్యన కొద్దిసేపు వాగ్వాదం చేసుకుంది. బొల్లినేని ఏకపక్ష ధోరణితో మండల పార్టీ మూడు వర్గాలుగా విడిపోయినట్లు ఆ పార్టీ నాయకులు విలేకరుల ఎదుట వాపోవడం విశేషం.

నిద్రావస్థలో నిఘానేత్రం

- పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలు
- నిరుపయోగంగా కమాండ్ కంట్రోల్ వ్యవస్థ
- పట్టించుకోని పోలీసులు



కావలి-ఉదయగిరి రోడ్డులో నిరుపయోగంగా మారిన సీసీ కెమెరాలు

కావలి: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల ఛేదనలో కీలకమైన సీసీ కెమెరాలను పోలీసులు అటకెక్కించారు. వాటి పర్యవేక్షణకు ప్రత్యేకంగా నిర్మించిన కమాండ్‌కంట్రోల్ భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. దీంతో పోలీసుల తీరుపై పట్టణ ప్రజల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.3కోట్లతో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు

జిల్లాలో నెల్లూరు తర్వాత అన్ని రకాలుగా ప్రాముఖ్యత కలిగిన పట్టణం కావలి. నెల్లూరు-ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉండడం, రాయలసీమ ముఖద్వారంగా ఉండడం, వస్త్ర వ్యాపార రంగంలో మినీముంబయిగా విరాజిల్లుతుండడం, విద్యారంగంలో విశిష్ట స్థానం సంతరించుకోవడం.. తదితర కారణాల రీత్యా కావలి పట్టణం సున్నితమైంది. రాష్ట్రంలోని ఎక్కడెక్కడి వారో పట్టణాన్ని సందర్శిస్తుంటారు. పోలీసుల అంచనా మేరకు పట్టణంలో రోజుకు పది వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల ఛేదనకు గతంలో పోలీసు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సుమారు రూ.3 కోట్లతో ప్రధాన కూడళ్లలో 50 చోట్ల సీసీ కెమెరాలు, వాటిని 24 గంటలు పర్యవేక్షించేందుకు డీఎస్పీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెల్లూరులోని సెంట్రల్ కమాండ్ కంట్రోల్‌కు సీసీకెమెరాలను అనుసంధానం చేశారు. అప్పట్లో కావలి సరిహద్దు ప్రాంతమైన గౌరవరం నుంచి జిల్లా సరిహద్దు గ్రామమైన రుద్రకోట వరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశారు. అందులో భాగంగా తొలుత పట్టణంలోని ప్రధాన కూడళ్లలో 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేశారు. అక్కడ పోలీసు నిపుణులు 24 గంటలు సీసీపుటేజీని పర్యవేక్షిస్తుండేవారు. నేరాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వాహనదారులను గుర్తించి చలానాలను పంపేవారు. పట్టణంలోని ప్రధానమైన ట్రంక్‌రోడ్డులోనే అన్ని వ్యాపార సంస్థలు, వస్త్ర మార్కెట్లు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు, పోలీస్‌స్టేషన్లు, ఏరియా ఆస్పత్రి ట్రంక్‌రోడ్డు వెంబడే ఉన్నాయి. దీంతో ప్రజలు రాకపోకలతో నిత్యం ట్రంకురోడ్డు రద్దీగా ఉంటుంది. సీసీ కెమెరాలు వినియోగంలో ఉంటే ఎక్కడ ఏం నేరం జరిగినా ఆధారాలు సేకరించడానికి పోలీసులకు సులభంగా ఉంటుంది. అయితే పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లోని సీసీ కెమెరాలు చాలావరకు పనిచేయడం లేదు. పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనంలో సీసీ కెమెరాల పర్యవేక్షణను సైతం పోలీసులు గాలికొదిలేశారు. ఈ విషయమై కావలి వన్ టౌన్ సీఐ శ్రీనివాసరావును సంప్రదించగా సీసీకెమెరాలు ఎప్పట్నుంచో పని చేయడం లేదని, పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నిరుపయోగంగా మారిన పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం

కేసుల ఛేదనలో విఫలం

ట్రంక్‌రోడ్డులోని గాంధీ విగ్రహం కూడలి వద్ద రాజ్యలక్ష్మి అనే మున్సిపల్ కార్మికురాలు గురువారం పారిశుధ్య పనులు చేపడుతుండగా కారు వేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడింది. సమీపంలోనే సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయకపోవడంతో పోలీసులు కారును గుర్తించలేకపోయారు.

- ఇటీవల జనతాపేటలో విద్యార్థుల గదిలోని మూడు లాప్‌ట్యాప్‌లు, రెండు సెల్‌ఫోన్లు పట్టపగలే చోరీకి గురయ్యాయి. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా పనిచేయకపోవడంతో దొంగల ఆనవాళ్లు తెలియక బాధితుల ఫిర్యాదును పోలీసులు కేవలం రికార్డులకే పరిమితం చేశారు.
- ఇటీవల పుల్లారెడ్డినగర్‌లో సాయంత్రం వేళ వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు సరుడులను బైక్‌లపై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను గుర్తించడం సాధ్యపడలేదు. బాధిత మహిళల నుంచి ఫిర్యాదులు తీసుకున్న పోలీసులు చేతులు దులుపుకొన్నారు. ఇలా పట్టణంలో జరిగిన చిన్నచిన్న కేసుల ఛేదనలోనూ పోలీసులు విఫలమవుతున్నారు.

ప్రజల్లో ధైర్యం ఉంటుంది



సీసీకెమెరాలు ఉంటే మరింత రక్షణలో ఉన్నామనే ధైర్యం ప్రజల్లో ఉంటుంది. ఏ చిన్న నేరం చేసిన పోలీసులకు దొరికిపోతామని నేరాలు చేయడానికి నేరస్థులు సాహసం చేయరు. అందువల్ల పట్టణంలోని సీసీ కెమెరాలు సమర్థవంతంగా పని చేసేలా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

–కూనం తాతిరెడ్డి, వైస్‌చైర్మన్, రైల్ అండ్ రోడ్డు ప్యాసింజర్స్ అసోసియేషన్, కావలి

దొంగలు పెట్రేగిపోతున్నారు



పట్టణంలో సీసీకెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలు పెట్రేగిపోతున్నారు. ఊర్లకు వెళితే ఇళ్లు దోచేస్తున్నారు. మహిళలను వీధుల్లో వేధించేవారు ఎక్కువయ్యారు. పోలీసులు స్పందించి సీసీకెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.

–చాకలికొండ శారద, విశ్రాంత హెచ్‌ఎం

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కొండాపురం : ఇంటర్మీడియట్ విద్యార్థినులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తహసీల్దార్ ఆర్ బ్రహ్మయ్య, ఎస్సై షేక్ ఖాజావలి అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలోని జూనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థినులకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్, ఎస్సైలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులకు పరీక్ష సామగ్రి అందజేసిన మిత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దేవినేని అశోక్‌ను అభినందించారు. కేజీబీవీ ప్రత్యేకాధికారి జయంతి, మిత్ర ఫౌండేషన్ సభ్యులు వెంకటసురేష్, పాదిలి రాము, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సామాజిక విప్లవం



మాట్లాడుతున్న మెట్టుకూరు చిరంజీవిరెడ్డి

కలిగిరి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సామాజిక విప్లవం తీసుకొచ్చారని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్‌బోర్డు చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనంతపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ప్రజాసంకల్ప పాదయాత్ర సమయంలో ప్రజల కన్నీటిగాథలను ప్రత్యక్షంగా చూశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతిఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 70 శాతానికిపైగా పదవులు కేటాయించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. నాడు-నేడు ద్వారా విద్యా,వైద్యరంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చి పేదలకు నాణ్యమైన విద్యా, వైద్యం అందిస్తున్నారని వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా చిత్తశుద్ధితో రాజ్యాంగబద్ధమైన పాలన కొనసాగిస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవడానికి అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, కాలేషా, కనకయ్య, ఎంపీటీసీలు పల్లాల కొండారెడ్డి, చీమల రాగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, యకసిరి భవాని, సర్పంచ్‌లు సుబ్బానాయుడు, రాఘవ, స్థానిక నాయకులు వెంకి, సతీష్, బాషా, రామభద్రరావు, మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పందులను దూరంగా తరలించాలి



పందుల పెంపకందారులకు హెచ్చరికలు చేస్తున్న కమిషనర్ ఫణికుమార్

అల్లూరు: నగర పంచాయతీకి దూరంగా పందులను తరలించాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఫణికుమార్ పందుల పెంపకందారులను హెచ్చరించారు. ఈ నెల 20న 'పందుల స్వైరవిహారం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. నగర పంచాయతీకి దూరంగా పందులను తరలించాలని హెచ్చరించారు. వారం రోజుల గడువు ఇవ్వాలని పందులపెంపకందారులు కోరగా, గతంలోనూ హెచ్చరించామని తెలిపారు. ఇవే చివరి హెచ్చరికలని, వారంలోగా తరలించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

చేజర్ల: తనను జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమించినందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి జెడ్పీటీసీ పేర్ల పార్థసారథి గురువారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముకానీయకుండా పనిచేస్తామని పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

సీతారామపురం: మారంరెడ్డిపల్లి సొసైటీ కార్యాలయం, ఆర్‌బీకే కేంద్రాల్లో 13.5 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి చెన్నారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా అవసరమైన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నేడు బైక్ వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు సెబ్ స్టేషన్ పరిధిలో ఓ కేసు పట్టుబడిన మోటో జీబీ బైక్‌ను శుక్రవారం వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ బీ నయనతార గురువారం తెలిపారు. ఉదయగిరిలో ని సెబ్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10.30 గంటలకు వేలం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తుగా రూ.800 దరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

ఆత్మకూరు: వెంకట్రావుపల్లి గిరిజనకాలనీ వద్ద ఓ వ్యక్తి మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు ఆత్మకూరు సెబ్ సీఐ నయనతారా గురువారం తెలిపారు. బోయలచిరివెళ్లకు చెందిన పీ నాగసుబ్బారెడ్డి వెంకట్రావుపల్లి గిరిజన కాలనీ వద్ద బుధవారం సాయంత్రం మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తుండగా సెబ్ సిబ్బంది పట్టుకున్నట్లు చెప్పారు. అతని నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడ్ని గురువారం కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించిందని తెలిపారు.

మద్యం ధ్వంసం

ఆత్మకూరు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో పట్టుబడిన మద్యాన్ని డీఎస్పీ ఎన్ కోటారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లలో పట్టుబడిన మద్యాన్ని పారబోయడం, మంటల్లో తగులబెట్టడం వంటి చర్యలు చేపట్టారు. ఆత్మకూరులో సీఐ నాగేశ్వరరావు, ఎస్సైలు శివశంకర్‌రావు, సాయిప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

ఆశీర్వచనం

జలదంకి: మండలంలోని కృష్ణాపాడులో గురువారం జరిగిన సర్పంచ్ డాకా గోపాల్‌రెడ్డి, రమాదేవి దంపతుల కుమార్తె సునయన నలుగు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పాఠశాలల తనిఖీ



ఆత్మకూరురూరల్: మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ పాఠశాల, అశ్వినీపురంలోని ఉర్దూ, ఎంపీపీఎస్ పాఠశాలలను ఎంఈఓ షేక్ నజీర్‌బాషా గురువారం తనిఖీ చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల అభ్యాసన స్థాయిని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమలు, అమ్మఒడి, తదితర పథకాల అమల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మేలు జాతి పశువులతో ఆర్థికాభివృద్ధి



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న జేడీ బీ మహేశ్వరుడు

దుత్తలూరు: మేలుజాతి పాడిపశువులతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు బీ మహేశ్వరుడు పేర్కొన్నారు. మండలంలోని వెంకటంపేటలో గురువారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మేలుజాతి పశుసంపద అభివృద్ధికి రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అందులో భాగంగా మేలుజాతి పెయ్యదూడలు ఉత్పత్తికి సబ్సిడీపై సెమన్‌ను పంపిణీ చేస్తోందని వివరించారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకుని మేలుజాతి లేగదూడల సంరక్షణతో జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం లేగదూడల పోషణ, చూడి పశువుల పోషణ, పశుఅంబులెన్స్ సేవలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉత్తమ లేగదూడలకు బహుమతులు అందజేశారు. పశుగణాభివృద్ధి సంస్థ ఏడీ సోమయ్య, ఏడీఏ చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, వసంతరాయులు, నాగార్జున, నరేష్, రాఘవేంద్ర, సర్పంచ్ పెరుమాళ్ల సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో దుత్తలూరు, ఉదయగిరి, మండలాలకు చెందిన పశువైద్య సిబ్బందితో పశుసంవర్థక శాఖ జేడీ బీ మహేశ్వరుడు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పాడి రైతులకు మేలుజాతి పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై అవగాహన కల్పించి చైతన్యపరచాలని సూచించారు. వేసవిలో మూగజీవాలకు వ్యాపించే వ్యాధులపై పాడిరైతులకు అవగాహన కల్పించాలన్నారు. పశువైద్యశాలల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పశుగణాభివృద్ధి సంస్థ ఏడీ సోమయ్య, ఏడీ శశిశేఖర్, వైద్యులు రాఘవేంద్ర, నాగార్జున, నరేష్, వసంతరాయులు, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల పరిశీలన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసన్నకుమారి,

వింజమూరు: మండలంలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలైన చింతలపాళెం, ఏ కిస్తీపురాన్ని ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కే వరప్రసాద్ గురువారం సందర్శించారు. ఆయా గ్రామాల్లోని ఫ్లోరైడ్ బాధితుల్ని పరామర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు ఫ్లోరైడ్‌రహిత తాగునీరు సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. గతంలో తాము వినియోగిస్తున్న బావి నుంచి తాగునీరు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీడీఓ ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. అప్పటి వరకు వింజమూరు నుంచి ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచినీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాట్ల రమణారెడ్డి, కార్యదర్శి విజయమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడడం నేరం



ఉదయగిరి: అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు



వింజమూరు:మాట్లాడుతున్న సీఐ సాంబశివరావు

ఉదయగిరి: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడడం నేరమని సీఐ గిరిబాబు తెలిపారు. స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులతో సీనియర్ విద్యార్థులు స్నేహభావంతో నడుచుకోవాలన్నారు. ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌తో ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై ఎన్ ప్రభాకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఆకుల నరసింహారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వింజమూరు: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సీఐ సాంబశివరావు సూచించారు. వింజమూరులోని నేతాజీ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు ర్యాగింగ్‌పై గురువారం ఆయన అవగాహన కల్పించారు. జూనియర్లు, సీనియర్లు స్నేహభావంతో నడుచుకోవాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై జంపానికుమార్, కళాశాల ప్రిన్సిపల్ రాంగోపాల్, వైఎస్సార్‌సీపీ కలిగిరి మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ర్యాగింగ్ పేరుతో విద్యార్థులు వికృత చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు. ఆత్మకూరు ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు ర్యాగింగ్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్సై ఎం శివశంకర రావు, కళాశాల ప్రిన్సిపల్ కిషోర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక వెంకటేశ్వర కళాశాలలోని విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సైబర్ నేరాలపై సీఐ రవినాయక్, ఎస్సై నాగార్జునరెడ్డి గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రవినాయక్ మాట్లాడుతూ ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



శిక్షణ ఇచ్చిన టీచర్లకు సన్మానం

వింజమూరు: ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు పాటించి పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య పిలుపునిచ్చారు. వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో వసతి గృహాల్లో చదివుతున్న విద్యార్థులకు పునశ్చరణ, ప్రేరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉపాధ్యాయుల సలహాలు పాటించాలన్నారు. ఎక్కువ మార్కులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఖాజావలి

కొండాపురం: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలని ఎస్సై షేక్ ఖాజావలి సూచించారు. మండలంలోని ఆదర్శ, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్, మత్తు పదార్థాలకు బానిసలు కావడం వలన జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా, కేజీబీవీ ఎస్‌ఓ జయంతి, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గ్రిగ్ పోటీలు



ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు

సంగం: మండలంలోని కొరిమెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, షటిల్, తదితర పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం ఫైనల్ పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని ఎంఈఓ జానకీరాం తెలిపారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల విజేత చేజర్ల

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడల్లో బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో చేజర్ల విద్యార్థులు సత్తా చాటారు. సంగం మండలం కొరిమెర్ల ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో సీనియర్, జూనియర్ బాలుర విభాగాల్లో చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం హైమావతి, పీడీ మల్లికార్జునరావు అభినందించారు.